క్లుప్తంగా...

ఆర్థిక సహాయం అందజేత



ఆర్థిక సాయం అందజేస్తున్న మెట్టు వెంకన్న

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ 7వ డివిజన్ బీజేఆర్‌నగర్‌లో నివసించే కుంచాల సుబ్బరత్నమ్మ అనారోగ్యంతో బాధపడుతూ మృతిచెందింది. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ మెట్టు ఆశాకుమారి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం డివిజన్ అధ్యక్షులు మెట్టు వెంకన్న బాధిత కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో అంబాజీ, భిక్షపతి, మాధవరావు, కాలనీవాసులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ఓటమి ఖాయం

– మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



కాంగ్రెస్‌లో చేరుతున్న నాయకులు

ఘట్‌కేసర్: దేశానికి కాంగ్రెస్ పార్టీ ఎంతో సేవ చేసిందని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నాయకుడు మలిపెద్ది సుధీర్‌రెడ్డి అన్నారు. ఘట్‌కేసర్ మండలంలోని కొర్రెముల్ సింగిల్ విండో డైరెక్టర్ బాల్‌రాజ్ యాదవ్ గురువారం తన అనుచరులతో కలిసి సుధీర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ఓటమి తప్పదన్నారు. ఒకప్పుడు పాలు, పూలు అమ్మిన వ్యక్తి నేడు భూముల కబ్జా చేస్తున్నాడని, స్థానిక సంస్థలు, ఇతర ఎన్నికల్లో డబ్బులు దండుకుంటే బీఫాం ఇచ్చారని ఆరోపించారు. మేడ్చల్ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ అజయ్ యాదవ్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు రాజేశ్, రాములు, జంగయ్య, మధు, వెంకటేశ్, మల్లేశ్, తదితరులు పాల్గొన్నారు.

గుర్రం అపహరణ

శామీర్‌పేట్: గుర్రాన్ని గుర్తుతెలియని వ్యక్తులు అపహరించిన ఘటన శామీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం మండలంలోని అలియాబాద్ గ్రామంలోని ఓ ఆశ్రమంలో నివాసముంటున్న దత్యదర్శి అనే వ్యక్తి కొంత కాలంగా శివరాజ్ అనే పేరుతో ఓ గుర్రాన్ని పెంచుకుంటున్నాడు. రోజులాగే బుధవారం రాత్రి గుర్రానికి దానా పెట్టి పడుకున్నాడు. గురువారం ఉదయం గుర్రం కనిపించలేదు. చుట్టుపక్కల వెతికినా ప్రయోజనం లేకపోవడంతో శామీర్‌పేట్ పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తులో భాగంగా గుర్రాన్ని అపహరించి వ్యక్తి నగరంలో విక్రయిస్తుండగా పట్టుకుని బాధితుడికి అప్పగించినట్లు సమాచారం.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

పోచారం: గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గురువారం తేనుగూడలో గుర్తించారు. పోచారం పోలీస్ స్టేషన్ సీఐ వి.అశోక్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటాపూర్ గ్రామ పరిధిలోని తేనుగూడ వద్ద కుళ్లిన వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు ఆ ప్రాంతానికి చేరుకొని మృత దేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడి వయస్సు సుమారు 36 సంవత్సరాలు, ఐదున్నర అడుగుల ఎత్తు ఉండొచ్చని, గోధుమ రంగు టీషర్టు, బ్లూకాటన్ జీన్స్ ధరించాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

యాప్రాల్‌లో పోలీసుల తనిఖీలు





జవహర్‌నగర్: ఎన్నికల నిబంధనలు అమలులో ఉన్నందున జవహర్‌నగర్ పోలీసులు గురువారం యాప్రాల్‌లోని శైలీ గార్డెన్ వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. బోయిన్‌పల్లికి చెందిన కమలేష్ అనే వ్యక్తి వద్ద రూ.1.50 లక్షల నగదు, రూ.3.66 లక్షల విలువ చేసే బంగారానికి సంబంధించి సరైన పత్రాలు లేకపోవడంతో నగదు, బంగారాన్ని స్వాధీనం చేసుకొని జిల్లా ట్రెజరీ కార్యాలయానికి పంపించి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఎన్నికల వేళ..

ఉపాధి అవకాశాలు..!

కొన్ని వర్గాలకు చేతినిండా పని..

శాసనసభ ఎన్నికల పుణ్యమాని.. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని కొన్ని వర్గాలకు చేతినిండా పని లభిస్తోంది. ఓటర్లకు ఆకట్టుకోవాలంటే పార్టీ శ్రేణులు కూడా నయా పోకడలకు శ్రీకారం చుట్టాల్సి వస్తోంది. విభిన్న తరహాలో ప్రచార సామాగ్రిని సమకూర్చుకోవడం, వెంట ఉండే కార్యకర్తలు, నాయకుల మంచి, చెడ్డలు చూసుకోవాల్సి వస్తోంది. ఇక రాష్ట్ర నాయకుల రాకతో వీటి ఖర్చు మరింత పెరుగుతుందనడంలో సందేహం లేదు. ఈ నేపథ్యంలోనే ఎన్నికల ప్రచారం సమయంలో.. ప్రతిరోజూ వందలాది మందికి ఉపాధి లభిస్తోంది. పైగా నగర శివారుల్లోని మేడ్చల్, రంగారెడ్డి జిల్లాలో కుటీర, చిన్నతరహా పరిశ్రమలు కూడా ఉండటంతో.. ఎన్నికల ప్రచారానికి ఉపయోగపడే సామాగ్రితో సహా ఇతర అవసరాలకు సంబంధించిన మెటీరియల్ అవసరం ఏర్పడగా, వాటికి గిరాకీ పెరిగింది. దీంతో కొన్ని వర్గాల ఉపాధికి అవకాశాలు పెరిగాయి.

– సాక్షి, మేడ్చల్ జిల్లా

- దర్జీలు జెండాలు, దుస్తుల తయారీ..
- డప్పు కళాకారులకు పెరిగిన ఆదరణ
- టెంట్ హౌజ్‌లు.. అద్దె వాహనాలకు డిమాండ్
- టిఫిన్లు.. భోజనాలు.. వంట వారికి గిరాకీ







చేతినిండా పని..

పండగలకు సర్వసాధారణంగా దర్జీలకు గిరాకీ షరా మమూలే.. అయితే ఎన్నికల వేళ ఈ వర్గాల వారికి చేతినిండా పని లభిస్తోంది. గ్రామం మొదలుకుని మండలం, బస్తీ, పట్టణం జిల్లా, రాష్ట్రస్థాయి నాయకుల వరకు కద్దర్ బట్టలు వేసుకోవడం ఇప్పటి రాజకీయాలకు పరిపాటిగా మారింది. ఓటర్లను ఆకర్షించడానికి.. పెద్ద నాయకుల దృష్టిలో పడటానికి దుస్తుల అమరిక తప్పనిసరి. అలాగే, కొన్ని పార్టీలు జెండాలతో సహా పార్టీ రంగులతో కూడిన కోడ్ డ్రెస్సులు కుట్టించుకుంటున్నారు. ఈ క్రమంలోనే దర్జీలు గిరాకీ పెరిగింది.

డప్పు, ఇతర కళాకారులకు ఆదరణ

శివారుల్లోని జవహర్‌నగర్, మేడ్చల్, శామీర్‌పేట, ఘట్‌కేసర్, కీసరతో సహా పలు ప్రాంతాలు, గ్రామాలు, బస్తీల్లో నివసిస్తున్న డప్పు కళాకారులతో సహా ఇతర కళాకారులకు ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదరణ లభిస్తోంది. డప్పు చప్పుళ్లతో అభ్యర్థులు, నాయకులు ప్రదర్శన, బహిరంగ సభలు సమావేశాలు ఏర్పాటు చేయాల్సి ఉంటోంది. ముఖ్య నాయకుల రాక సందర్భంగా డప్పు చప్పుళ్ల నృత్యాలు సర్వసాధారణంగా మారాయి.

టెంట్ హౌజ్, కుర్చీలకు..

ఎన్నికల ప్రచారంలో అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలు సభలో మాట్లాడేందుకు హాజరు కావాల్సిన వారికి నీడ ఏర్పాటుతో పాటు కుర్చీలు వేయాల్సి ఉంటుంది. దీంతో టెంట్ హౌజ్ వారికి గిరాకీ పెరగనుందనే చెప్పవచ్చు. టెంట్లు, కుర్చీలను బట్టి ధర ఉంటుంది.

అద్దె వాహనాలకు డిమాండ్..

ఎన్నికల నిర్వహణ యంత్రాంగం, పర్యవేక్షణ అధికారులు, సిబ్బందితో సహా.. ఎన్నికల బరిలో దిగిన అభ్యర్థులతోపాటు నాయకులు, కార్యకర్తలను పోలింగ్ కేంద్రాలు, గ్రామాలు, బస్తీలు, పట్టణాలకు తీసుకెళ్లడానికి పదుల సంఖ్యలో వాహనాలు అవసరం. సొంత వాహనం అభ్యర్థికి అవసరమైతే, మిగతా వారికి అద్దె వాహనాలు ఏర్పాటు చేస్తున్నారు. ప్రచార రథంతో పాటు బహిరంగ సభలకు జనాన్ని తరలించడానికి కూడా వాహనాలు అవసరం అవుతుండటంతో ప్రైవేటు వాహన యజమానులకు గిరాకీ పెరిగింది.

టిఫిన్లు, భోజనాలు..

నగరంతో సహా శివారు జిల్లాల్లోని పలు ప్రాంతాలు, బస్తీలు, గ్రామాల్లో సభలు, సమావేశాలు, ప్రచారానికి వెళ్లే ముందు నాయకులు, కార్యకర్తలకు ఉదయం టిఫిన్లు తప్పనిసరి. మధ్యాహ్నం భోజనం ఏర్పాటుతో హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, క్యాటరింగ్ వర్గాలకు గిరాకీ పెరిగిందనే చెప్పవచ్చు. హోటల్ యజమానులు, కేటరింగ్ వర్గాలు ఆర్డర్ కోరిన ప్రాంతానికి టిఫిన్లు, భోజనాలు వండి తీసుకెళ్తున్న ఘటనలు కనిపిస్తున్నాయి.

వంట మనుషులకు పెరిగిన గిరాకీ..

పార్టీల కార్యకర్తలను తమ పార్టీలో చేర్చుకునే ఘటనలు ప్రధాన పార్టీలో నిత్యం చోటు చేసుకుంటున్నాయి. దీనికి తోడు ప్రచారానికి వచ్చిన కార్యకర్తలకు భోజనాలు ఏర్పాటు చేయించాల్సి ఉంటుంది. కొందరు సమావేశాల పేరుతో హాజరైన వారికి చికెన్, మటన్ బిర్యానీ ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా వంట మనుషులను నెలవారీగా మాట్లాడుకుని భోజన వసతి ఏర్పాటు చేస్తున్నారు. నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లో వందల సంఖ్యలో వంట మనుషులకు ఉపాధి లభిస్తోంది.

పెట్రోలు బంకుల్లో క్యూ..


అభ్యర్థి ఆయన మద్దతుదారులు పదుల సంఖ్యలో కార్లు, సుమోలు వినియోగిస్తుంటారు. ద్విచక్ర వాహనాల ర్యాలీల సందర్భంలోనైతే పెట్రోలు బంకుల్లో క్యూ కట్టాల్సిందే. ద్విచక్ర వాహనంపై ప్రచారానికి వెళ్లే నాయకులు, కార్యకర్తలకు తమ వాహనాల్లో పెట్రోలు, డీజిల్ పోయించాల్సి ఉంటుంది. పెట్రోలు, డీజిల్ అమ్మకాలు కూడా పెరిగాయి.

పూలకూ గిరాకీ..

ఎన్నికల ప్రచారానికి వచ్చే అభ్యర్థికి, ద్వితీయ శ్రేణి నాయకులకు పూల దండలు వేయడానికి నాయకులు, కార్యకర్తలు పోటీ పడుతుంటారు. ప్రచారంలో అభ్యర్థులపై పూల వర్షం కురిపిస్తున్నారు. దీంతో పూల వ్యాపారులకు గిరాకీ పెరిగింది.

పెరిగిన 1,30,698 మంది ఓటర్లు

మేడ్చల్‌లో ఓటర్లు 5,95,382



మేడ్చల్: మేడ్చల్ నియోజకవర్గంలో ఓటర్ల తుది జాబితాను అధికారులు సిద్ధం చేసి విడుదల చేశారు. మొత్తం నియోజకవర్గంలో 5,95,382 ఓటర్లున్నారు. ఇందులో 3,06,854 మంది పురుషులు, 2,88,486 మంది స్త్రీ ఓటర్లు ఉన్నారు. 42 మంది ట్రాన్స్ జెండర్లు ఉన్నారు. 2018 ఎన్నికల్లో 4,64,684 మంది ఓటర్లుండగా తాజాగా సంఖ్య 5,95,382కు చేరింది. ఐదేళ్లలో 1,30,698 మంది ఓటర్లు పెరిగారు.

అత్యధికం బోడుప్పల్..

అత్యల్పం గుండ్లపోచంపల్లి..

మేడ్చల్ నియోజకవర్గంలో మూడు మున్సిపల్ కార్పొరేషన్లు, ఏడు మున్సిపాలిటీలు, 62 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. మేడ్చల్, శామీర్‌పేట్, ఘట్‌కేసర్, కీసర, మూడుచింతలపల్లి మండలాలుండగా, మేడ్చల్, గుండ్లపోచంపల్లి, ఘట్‌కేసర్, పోచారం, దమ్మాయిగూడ, నాగారం, తూంకుంట, మున్సిపాలిటీలు బోడుప్పల్, పీర్జాదిగూడ, జవహర్ నగర్ కార్పొరేషన్లు ఉన్నాయి. అధికంగా బోడుప్పల్ కార్పొరేషన్‌లో.. అత్యల్పంగా గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో ఓటర్లు ఉన్నారు.

ఓటర్ల వివరాలు..

ప్రాంతం	ఓటర్లు	స్త్రీలు	పురుషులు	ఇతరులు
మేడ్చల్ (మండలం)	31,167	15290	15877	–
శామీర్‌పేట్(మండలం)	29,184	14277	14904	3
కీసర(మండలం)	25,601	12564	13034	3
ఘట్‌కేసర్(మండలం)	37,591	14080	14413	–
మేడిపల్లి(మండలం బోడుప్పల్)	35,692	17203	18489	–
కాప్రా (మండలం, జవహర్‌నగర్)	21,178	10377	10799	2
మూడుచింతలపల్లి(మండలం)	19,565	9625	9939	1
గుండ్లపోచంపల్లి (మున్సిపాలిటీ)	17,672	8155	9516	1
మేడ్చల్(మున్సిపాలిటీ)	40,223	18900	21320	3
తూంకుంట(మున్సిపాలిటీ)	20819	9975	10841	3
నాగారం(మున్సిపాలిటీ)	46985	2217	24766	2
దమ్మాయిగూడ(మున్సిపాలిటీ)	41154	20004	21146	4
పోచారం(మున్సిపాలిటీ)	27481	13288	14191	2
ఘట్‌కేసర్ (మున్సిపాలిటీ)	28494	14080	14413	1
బోడుప్పల్ (కార్పొరేషన్)	66208	32060	34145	3
పీర్జాదిగూడ(కార్పొరేషన్)	50861	24428	26428	5
జవహర్‌నగర్(కార్పొరేషన్)	55507	27612	27889	6
మొత్తం	595382	288486	306854	42

ఆలయ నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజలో నాయకులు, ముదిరాజ్‌లు

మేడ్చల్‌రూరల్: మండలంలోని పూడూర్ గ్రామంలో పెద్దమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో గురువారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వేద పండితులు మంత్రోచ్ఛరణలో యంత్ర ప్రతిష్ఠ, హోమం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బాబుయాదవ్, ఎంపీటీసీ రఘు, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు యాదయ్య, మాజీ అధ్యక్షుడు సారా లింగం, యూత్ అధ్యక్షుడు నాగరాజు, ఉపాధ్యక్షుడు పరమేశ్, ముదిరాజ్‌లు, గ్రామ నాయకులు పూజల్లో పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లోకి పలువురు కాంగ్రెస్ నాయకులు



బీఆర్‌ఎస్‌లో చేరిన వారికి కండువాలు కప్పుతున్న మంత్రి మల్లారెడ్డి

మేడ్చల్: పట్టణంలోని ఏడో వార్డుకు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. వార్డుకు చెందిన నర్సింగ్‌రావు ఆయన అనుచరులకు మంత్రి మల్లారెడ్డి బీఆర్‌ఎస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి మహేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్ యాదవ్, పట్టణ అధ్యక్షుడు శేఖర్‌గౌడ్, నాయకులు వెంకటేష్, బాల మల్లేష్, సత్యనారాయణ, రామస్వామి, నవీన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ మాయమాటలు నమ్మొద్దు



పోచారం: కర్నాటకలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ రైతులకు 3 గంటలకు మించి కరెంటు ఇవ్వడంలేదని, ఆ పార్టీ నాయకులు చెప్పే మాయమాటలు నమ్మి మోసపోవద్దని కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. అన్నోజిగూడలోని ఓ ఫంక్షన్ హాల్‌లో గురువారం జరిగిన బూత్ కమిటీల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుబంధు ఆపేయాలని ఎలక్షన్ కమిషన్‌ను కాంగ్రెస్ నాయకుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కోరడం ఎంత వరకు సమంజసం అన్నారు. ఇది పాత పథకమే అయినా అడ్డుకోవడమేమిటని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అన్ని పథకాలను అటకెక్కిస్తారని చెప్పారు. ఎంపీగా గెలిచిన రేవంత్‌రెడ్డి తన నియోజకవర్గానికి ఏం చేశాడో చెప్పాలన్నారు. టీపీసీసీ అధ్యక్ష పదవి కొనుక్కొని, సీట్లు అమ్ముకుంటున్న రేవంత్‌ను ప్రజలు నమ్మరన్నారు. సొంత నిధులతో మేడ్చల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నానని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి, వైస్ చైర్మన్ రెడ్యానాయక్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ దయాకర్‌రెడ్డి, మల్లారెడ్డి హెల్త్ సిటీ చైర్మన్ చామకూర భద్రారెడ్డి, బీఆర్‌ఎస్ పోచారం మున్సిపల్ అధ్యక్షుడు మందడి సురేందర్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ గొంగళ్ల బాలేష్, ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి శేఖర్, కౌన్సిలర్లు మెట్టు బాల్‌రెడ్డి, బద్దం మమతా జగన్‌మోహన్ రెడ్డి, బాలగోని వెంకటేశ్ గౌడ్ పలువురు నాయకులు పాల్గొన్నారు.

మూడోసారి బీఆర్‌ఎస్ గెలుపు ఖాయం



కీసర: అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేసిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి రావడం ఖాయమని బీఆర్‌ఎస్ ప్రభుత్వం మంత్రి మల్లారెడ్డి అన్నారు. గురువారం చీర్యాల గ్రామంలోని శ్రీలక్ష్మీనర్సింహ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన కీసర మండల బీఆర్‌ఎస్ పార్టీ బూత్‌స్థాయి కమిటీ నాయకుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని పదేళ్లుగా సీఎం కేసీఆర్ అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తూ ముందుకు తీసుకెళ్తున్నారు. ఎన్నికల వేళ మాయమాటలు చెప్పి అమలుకు వీలుకాని హామీలు ఇస్తూ కాంగ్రెస్, బీజేపీలు ప్రజలను మోసం చేసేందుకు యత్నిస్తున్నాయని విమర్శించారు. పొరపాటున ప్రజలు వారిమాటలు విని మోసపోతే భవిష్యత్‌లో ఇబ్బందులు పడాల్సి వస్తుందని, సంక్షేమ, అభివృద్ధి పథకాలు నిలిచిపోతాయన్నారు. ఇక మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి బీఆర్‌ఎస్ ఎంతో మేలు చేసిందని, ఎమ్మెల్యేను చేస్తే అభివృద్ధిని మరిచి సొంత పనులు చేసుకోవడం, డబ్బు సంపాదపైనే దృష్టిసారించాడని విమర్శించారు. తండ్రి ఎమ్మెల్యేగా, కొడుకు జెడ్పీ చైర్మన్‌గా పదవులు అనుభవించి కాంగ్రెస్ అభ్యర్థి ఇచ్చిన ప్యాకేజీకి అమ్ముడుపోయారన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నేతలు చామకూర మహేందర్‌రెడ్డి, చామకూర భద్రారెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ బెస్త వెంకటేష్, ఎంపీపీ ఇందిరాలక్ష్మీనారాయణ, వైస్‌ఎంపీపీ జె.సత్తిరెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు జలాల్‌పురం సుధాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సింగారం నారాయణ, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, బీఆర్‌ఎస్ నేతలు తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ పాలనలో ఎంతో అభివృద్ధి



ఎల్లంపేట్‌లో బీఆర్‌ఎస్ బూత్ కమిటీలతో నాయకులు

మేడ్చల్‌రూరల్: మండలంలోని రావల్‌కోల్, ఎల్లంపేట్, రాజబొల్లారం తండా, మునీరాబాద్ గ్రామాల్లో గురువారం బీఆర్‌ఎస్ పార్టీ బూత్ కమిటీలు ఏర్పాటు చేశారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దయానంద్ యాదవ్ ఆధ్వర్యంలో గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించి బూత్ కమిటీలను నియమించారు. కేసీఆర్ పాలనలో ప్రజలకు అందిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రతి ఇంటికీ చేరవేసి పార్టీ గెలుపు కోసం పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రాజమల్లారెడ్డి, పార్టీ ప్రధాన కార్యదర్శి సుదర్శన్, మండల యూత్ అధ్యక్షుడు హరత్‌రెడ్డి, సర్పంచులు మహేందర్, వెన్నెల రామకృష్ణుడు, మంగ్యానాయక్, గణేశ్, ఉప సర్పంచులు, పార్టీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపు కోసం పనిచేయాలి

మేడ్చల్: నియోజకవర్గంలో కాంగ్రెస్ గెలుపు కోసం ప్రతి నాయకుడు, ప్రతి కార్యకర్త నెల రోజుల పాటు కష్టపడి పనిచేయాలని మున్సిపాలిటీ నాయకులు రొయ్యపల్లి మల్లేష్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, ఏబ్లాక్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పానుగంటి మహేష్ కోరారు. మేడ్చల్‌లో నిర్వహించిన మున్సిపాలిటీ ప్రధాన నాయకుల సమావేశంలో వారు మాట్లాడుతూ పార్టీ ప్రకటించిన అభ్యర్థి తోటకూర వజ్రేష్ యాదవ్ గెలుపు కోసం నాయకులు చురుగ్గా పని చేయాలన్నారు. ప్రతి నాయకుడు తమ వార్డుల్లో ముందుండి ప్రచారం చేయాలన్నారు. నాయకులు ఏక తాటిపై పని చేసి అభ్యర్థి గెలుపు కోసం కృషి చేయాలన్నారు. సమావేశంలో నాయకులు లక్ష్మణ్, ఆనంద్, కిరణ్ రెడ్డి, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.



ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలి



అన్నోజిగూడలో ఫ్లాగ్ మార్చ్‌లో డీసీపీ జానకి



ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న భద్రతా దళాలు

పోచారం: అసెంబ్లీ ఎన్నికల నిర్వహణ, భద్రతా ఏర్పాట్ల కోసం పారా మిలటరీ బలగాలు వచ్చాయని డీసీపీ జానకి అన్నారు. మల్కాజిగిరి జోన్‌కు రెండు కంపెనీల పారామిలటరీ బలగాలు రావడం జరిగిందన్నారు. గురువారం సాయంత్రం పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్ సిబ్బంది అన్నోజిగూడలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎలక్షన్ కమిషన్, పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు అన్నోజిగూడ నుంచి రాజీవ్ గృహకల్ప వరకు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించామన్నారు. ఓటర్లు ఎలాంటి భయాందోళన చెందకుండా ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా భద్రత కల్పిస్తున్నామన్నారు. ప్రజలు ప్రశాంత వాతావరణంలో ఓటు వేయాలన్నారు. ఫ్లాగ్ మార్చ్‌లో వంద మంది పారామిలటరీ దళాలతో పాటు పోలీస్ ఫోర్స్ పాల్గొన్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏసీపీ నరేష్‌రెడ్డి, సీఐ అశోక్‌రెడ్డి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఊరికి వెళ్లి వచ్చేసరికి ఇళ్లలో చోరీ



వివరాలు సేకరిస్తున్న పోలీసులు

కీసర: దసరా పండగకు ఊరికి వెళ్లి వచ్చేసరికి మూడు ఇళ్లలో దుండగులు చోరీకి పాల్పడిన ఘటన కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలోని నాగారం మున్సిపాలిటీలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నాగారం మున్సిపాలిటీ పరిధిలోని సత్యనారాయణ కాలనీ రోడ్డు నెంబర్–1లోని ఓ భవనంలో పక్కపక్కనే నాలుగు ఇళ్లు ఉన్నాయి. రాజేంద్రనాయక్, డేటావత్‌కుమార్, జైలాల్, దసరా పండగకి రెండు రోజుల క్రితం ఇళ్లకు తాళాలు వేసి సొంత ఊర్లకు వెళ్లారు. గురువారం ఉదయం తిరిగి వచ్చి చూసే సరికి మూడు ఇళ్ల తలుపులు విరిగి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూసే సరికి అల్మారాలు తెరిచి అందులోని దుస్తులు, ఇతర వస్తువులు చిందర వందరగా పడి ఉన్నాయి. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. రాజేంద్రనాయక్ ఇంట్లో దాచిన రూ.లక్ష నగదు, ఐదు గ్రాముల బంగారం, డెటావత్‌కుమార్ ఇంట్లో రూ.3.40 లక్షల నగదు, పది గ్రాముల వెండి, జైలాల్ ఇంట్లో రూ.20 వేల నగదు, 20 తులాల వెండి, 2 గ్రాముల బంగారు ఆభరణాలను దొంగలు ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు కీసర పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.